

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 312 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 14, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# ఎత్తుపల్లాలను.. ఎదుర్కోవాలి !

## ఆటుపోట్లను అధిగమించాలి




వ్యూహరచనలకు విలువనివ్వాలి

విలువైన ప్రణాళికలతో ముందుకు సాగాలి

దేశ చరిత్రలో కనివిని ఎరుగని ఉద్యమాలు జరుగుతున్నాయి

పోరాటం ఒకవైపు,..... పగలతో రగిలిపోతున్న అధికారం మరోవైపు

ప్రజాస్వామ్య రక్షణ దారులపై పగబట్టి దాడులు చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వం

విలువలతో కూడిన ఉద్యమాలు విజయాలను వరించేలా చేస్తాయి

ఢిల్లీ ఉద్యమాలకు, రాష్ట్రస్థాయి ఉద్యమాలకు పొంతన లేదు

ప్రతి రాష్ట్రంలో ప్రజాస్వామ్య రక్షణదారులు లక్షల సంఖ్యలో బయటకు రావాలి

భయం గుప్పిట్లో బలుపు పనులకు శ్రీకారం చుడుతున్నారు

డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. రాజ్యాంగ విలువల రక్షణ కోసం ప్రతిపక్షాలు, ప్రజాస్వామ్యవాదులు గళమెత్తుతున్నారు. ఓట్ల అక్రమాలపై వస్తున్న ఆరోపణలు జాతీయ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాల్సిన బాధ్యత రాజ్యాంగ సంస్థలపై ఉంది. ఢిల్లీ వేదికగా సాగుతున్న నిరసనలు రాజకీయంగా కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉద్యమాలను అణచివేయడం కంటే ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలను పరిష్కరించాలి. యువత, విద్యార్థులు, మేధావులు ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు సాగాలి. ఆవేశానికి కాకుండా వ్యూహరచనకు, వాస్తవాలకు ఉద్యమకారులు ప్రాధాన్యమివ్వాలి. ప్రతి ఆటుపోటును అధిగమిస్తూ విలువలతో కూడిన పోరాటాలను కొనసాగించాలి. ఢిల్లీ ఉద్యమాలకు, రాష్ట్రస్థాయి పోరాటాలకు మధ్య సమన్వయం పెరగాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాష్ట్రాల్లో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి. ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కాపాడటం ప్రతి వ్యవస్థ బాధ్యత. ఆరోపణలపై పారదర్శక విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. ప్రణాళికాబద్ధమైన ఉద్యమాలే ప్రజల్లో విశ్వాసాన్ని పెంచి విజయాలకు మార్గం వేస్తాయి. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ఐక్యంగా ముందుకు సాగాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు. హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## వ్యవస్థల మార్పు జర్నలిజంతోనే సాధ్యం

జర్నలిజాన్ని అరికట్టే దమ్ము ఎవ్వరికీ లేదు

సమాజంలో జవాబుదారీతనమే జర్నలిజం లక్ష్యం

జర్నలిస్టులపై పోలీసుల చర్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం !

వ్యవస్థల్లో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టడమే జర్నలిజం

సీనియర్ పోలీస్ అధికారికి సమన్లు..

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి: డా. బరిగెల శివ డిమాండ్

2



## ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై కిషన్ రెడ్డి ఆగ్రహం

ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారని ఆరోపణ

బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని విమర్శ

రైతులు, నిరుద్యోగుల సమస్యలపై నిరసనలకు అడ్డంకులు

అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని ఆచరించాలని హితవు

హైదరాబాద్, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :



ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నారని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.



## భారత్-వెస్టిండీస్ పోరుకు ఉప్పల్ సిద్ధం

నాలుగో టీ20 మ్యాచ్‌కు భారీ ఏర్పాట్లు

హెచ్‌సీఏ, బీసీసీఐ సమన్వయంతో సన్నాహాలు

భద్రత, ప్రేక్షకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

అంతర్జాతీయ క్రికెట్ సందడికి ఉప్పల్ వేదిక

భారత జట్టు ఆటను చూసేందుకు అభిమానుల ఆసక్తి

2

## పండుగ ప్రయాణాలకు 750కి పైగా ప్రత్యేక రైళ్లు

2

దసరా, దీపావళికి అదనపు సర్వీసులు

రద్దీని బట్టి రైళ్ల సంఖ్య పెంపు

ప్రత్యేక రైళ్లలో మూడో వంతు అదనపు ఛార్జీలు

స్టేషన్లలో అదనపు టికెట్ కౌంటర్లు

సీసీ కెమెరాలతో భద్రతా నిఘా

# ఎత్తుపల్లాలను ఎదుర్కోవాలి




**ఆటుపోట్లను అధిగమించాలి**
**వ్యూహరచనలకు విలువనివ్వాలి**
**విలువైన ప్రణాళికలతో ముందుకు సాగాలి**
**దేశ చరిత్రలో కనివిని ఎరుగని ఉద్యమాలు జరుగుతున్నాయి**
**పోరాటం ఒకవైపు,.... పగలతో రగిలిపోతున్న అధికారం మరోవైపు**
**ప్రజాస్వామ్య రక్షణ దారులపై పగబట్టి దాడులు చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వం**
**విలువలతో కూడిన ఉద్యమాలు విజయాలను వరించేలా చేస్తాయి**
**ఢిల్లీ ఉద్యమాలకు, రాష్ట్రస్థాయి ఉద్యమాలకు పొంతన లేదు**
**ప్రతి రాష్ట్రంలో ప్రజాస్వామ్య రక్షణదారులు లక్షల సంఖ్యలో బయటకు రావాలి**
**భయం గుప్పిట్లో బలుపు పనులకు శ్రీకారం చుడుతున్నారు**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

భారతదేశంలో అంతర్జాతీయ స్థాయి ఉద్యమాలు కొనసాగుతుండడం దేశ ప్రజల భవిష్యత్తును నిర్ధారించే విధంగా ఉన్నాయని డాక్టర్ బరిగెల శివ విశ్లేషించారు.దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధిని కోరుకోవాల్సిన ప్రభుత్వాలు ప్రజాభివృద్ధి వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న సందర్భంగా దేశంలో పేదరికం పెరిగిపోయి ప్రజా తిరుగుబాటు ఉద్యమాలకు దారితీసాయని పేర్కొన్నారు.దేశంలో జరుగుతున్న ప్రజా సమస్యల పట్ల ప్రజలు అనుభవిస్తున్న గడ్డు పరిస్థితిలను ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు ప్రజలు మేధావులు విద్యావేత్తలు ప్రజాస్వామ్యవాదులు కార్మిక సంఘాలు రైతు సంఘాలు నిరుద్యోగ సంఘాలు ఉద్యమకారుల సంఘాలు ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు అణిచివేతను ఎత్తుపల్లాల రూపంలో ఎదుర్కోక తప్పడం లేదన్నారు.భారతదేశంలో రాజకీయ పార్టీలకు అతీతంగా ఉద్యమాలు నడుస్తున్నాయని వాటిని ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం దగ్గర ప్రత్యామ్నాయ మార్గాలు లేక అణచివేత మార్గం ఒక్కటే శరణ్యంగా భావిస్తూ విద్యార్థి ఉద్యమాలను కక్ష సాధింపులతో నిర్మూలించే ప్రయత్నం చేస్తున్నారని నిర్మోహమాటం లేకుండా హెచ్చరించారు.ఏఐసిసి ప్రధాన నేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడంలో కనపరుస్తున్న క్రియాశీలక పాత్ర భారత దేశ విలువలతో పాటు భారతదేశంలోని ఆస్తులను భారతదేశంలోని ప్రభుత్వ వ్యవస్థలను పార్లమెంటు వ్యవస్థను జాతీయ ఎన్నికల వ్యవస్థను కాపాడుకొని తీరగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.అక్టోబర్ 9న భారత రాష్ట్రపతికి కలిసి దేశంలో జరుగుతున్న ఓట్ల అక్రమాలకు వ్యతిరేకంగా ఒక వినతి పత్రాన్ని సమర్పించడమే కాకుండా మూడు సంవత్సరాలుగా దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీ పట్ల తను వ్యక్తిగతంగా సమకూర్చిన ఆధారాలను ఏఐసిసి అధికార వెబ్సైట్లో పొందుపరచడమే కాకుండా దేశ ప్రజలు ప్రపంచ ప్రజలు గమనించే విధంగా డిజిటల్ మీడియా సమక్షంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి దేశంలో జరుగుతున్న ఓట్ల చోరీ పట్ల దేశ ప్రజలను అప్రమత్తం చేయడం రాజకీయ వ్యూహరచనలో తెలివైన తనాన్ని ప్రదర్శించగలిగారని మేధావులు అభినందిస్తున్నట్లు తెలిపారు.అక్టోబర్10 వ తేదీన ఢిల్లీ ప్రాంతంలోని జంతర్మంతర్ వద్ద జరిగిన జాతీయ ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వం చేసిన దాడులకు గాను అణిచివేతకు గాను ఓట్ల అక్రమాలపై దేశంలో నెలకొన్న పలువిధాల అనుమానాలను నివృత్తి పరచడం కోసం నిజమైన ఆధారాలు,వాస్తవమైన సమాచారాన్ని న్యాయస్థానాలతో పాటు ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలకు దేశ ప్రజలకు తెలియపరచబడే విధంగా అక్టోబర్ 12వ తేదీన ఓట్ల అక్రమాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం దేశ అత్యున్నత న్యాయస్థానం గర్వించదగ్గ విషయంగా భావించాల్సి ఉందన్నారు.అదే సందర్భంలో ఒకవేళ దేశ రాష్ట్రపతి,సుప్రీంకోర్టు ఓట్ల అక్రమాలపై సరైన విధంగా స్పందించకపోతే దేశ అత్యున్నత రాజ్యాంగ సంస్థలు బిజెపికి అనుకూలంగాను మద్దతుగాను నిలుస్తున్నాయని భారత దేశ ప్రజలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ వద్ద ఓట్ల అక్రమాలకు సంబంధించి తగిన సాక్షదారాలు ఆధారాలు ఉన్నాయని బలంగా విశ్వసిస్తూ నమ్మాల్సి ఉంటుందన్నారు.

**నియంత పోకడలపై ఎదురు దాడులు..**

భారతదేశంలో జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓట్ల చోరీ అక్రమాలపై జరుగుతున్న జాతీయ స్థాయి ఉద్యమాలలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రైళ్లు రద్దు చేయడం, మెట్రో స్టేషన్లు మూసివేయడం, నిరసనకారులను గృహనిర్బంధంలో బంధించడం,రోడ్లు మూసివేయడం,అర్ధ సైనిక బలగాలను మొహరింపజేయడం,హోటలలో తనిఖీలు నిర్వహించడం,ఢిల్లీ సరిహద్దుల వద్ద గార్డులను పెద్ద ఎత్తున నిలబెట్టడం,వైన్ షాపులను మూసివేయడం,ఇంటర్నెట్ నిలిపివేయడం,డ్రోన్ కెమెరాలతో ఉద్యమాలను తనిఖీలు నిర్వహించడం,కేంద్ర బలగాలచే దాడులు చేయించడం,మఫ్టీ సైన్యంతో ఉద్యమకారులను చితకొట్టించడం,లాంటి క్రూరమైన పనులకు శ్రీకారం చుట్టి ఉద్యమ తీవ్రతను దేశానికి కనిపించకుండా కేంద్ర ప్రభుత్వ అణచివేతను మాత్రమే దేశ ప్రజలు పసిగట్టే విధంగా చేపట్టిన ఒంటెద్దు పోకడలు కేంద్ర ప్రభుత్వాన్ని పూర్తిస్థాయిలో అపనిందలపాలు చేసిందని భావించాల్సి ఉంటుందన్నారు.దేశ ప్రజలు కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలు అణిచివేతను ఎదుర్కొని తట్టుకొని నిలబడుతూనే ఉద్యమకారుల రూపంలో అక్రమాలను ఎదిరిస్తూ ఓట్ల చోరీపై దాడి చేస్తూ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నారని అదే సందర్భంలో రాజ్యాంగ విలువలకు రక్షణగా నిలుస్తున్నారని గర్వంగా చెప్పారు.దేశంలో కొనసాగుతున్న నియంత పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాలలో కేవలం ఒకే ఒక ఎన్నికల అధికారి దేశాన్ని దేశ వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని సర్వనాశనం చేస్తుంటే అలాంటి సర్వనాశనం పరున్ని కాపాడుకోవడం కోసం బిజెపి ప్రభుత్వం ఇదంతా చేస్తున్నట్లుగా దేశ ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు అన్నారు.అధికార వ్యవస్థకు ఆదర్శంగా నిలవాల్సిన జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన అక్రమాలను కప్పిపుచ్చుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వ సహాయం కోరుతూనే వివిధ రాష్ట్రాల్లో కొనసాగిస్తున్న అక్రమాల పరంపర బయటకు రాకుండా ఉండడం కోసం తగు జాగ్రత్తలు పడుతూ దేశం వ్యవస్థలను నాశనం చేస్తున్నాడన్నది పచ్చి నిజం అన్నారు.ఆంధ్రప్రదేశ్ పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఎన్నికల ఈవీఎంల ట్యాంపరింగ్ పక్కాగా జరిగిందని నిజమైన ఆధారాలు తారుమారు చేయబడ్డాయని అధికారిక లెక్కలు నిజాయితీకి సరి సమానంగా పోసుకకపోవడంతో జ్ఞానేష్ కుమార్ బండారం బయటపడుతుందని అదేవిధంగా మూడు సంవత్సరాల కాలంలో కోట్ల ఓట్ల తొలగింపుకు శ్రీకారం చుట్టిన జ్ఞానేష్ కుమార్ తను పడిపోతే కేంద్ర ప్రభుత్వం పడిపోతుందనే భయంతో ఉద్యమకారులపై దేశ ప్రజలపై ఉక్కు పాదం మోపుతున్నాడని ఇలాంటి అధికారి స్థానాన్ని ఉన్నపాటుగా భర్తరఫ్ చేయాల్సిన అవసరం ఉందని అదే మార్గంలో దేశ ప్రజలు వాళ్ల ఉద్యమాలను తీవ్రతరం చేస్తున్నారని గుర్తు చేశారు.ఒకే ఒక్క అధికారి దేశాన్ని ఇంతలా నాశనం చేస్తుంటే దేశాన్ని రక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతున్న అధికారున్ని వెనకేసుకు రావడం కేంద్ర ప్రభుత్వం కుట్రలు బట్టబయలవుతున్నాయన్నారు.కేంద్ర ప్రభుత్వ అధికారులు 10 సంవత్సరాల పాటు లేనటువంటి జాతీయ ఎన్నికల కమిషన్ కొత్త విధానాలు 2023 నుండి ప్రవేశపెట్టడం వెనకాల జ్ఞానేష్ కుమార్ కుట్రలు ఉన్నత స్థాయిలో ఉన్నాయని దేశ ప్రజలు భావిస్తున్నారన్నారు.రాజ్యాంగ విలువలను అగౌరవపరుస్తూ దేశాన్ని పాడు చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ ను శిక్షించడం కోసం అణిచివేతని సైతం ఎదుర్కొని ఎదురుదాడితో కూడిన ఉద్యమాలు చేస్తున్న యువతను మేధావులను ప్రతిపక్ష నేతలను అభినందించుకొని తీరాలన్నారు.

---

# వ్యవస్థల మార్పు జర్నలిజంతోనే సాధ్యం




**జర్నలిజాన్ని అరికట్టే దమ్ము ఎవ్వరికీ లేదు**
**సమాజంలో జవాబుదారీతనమే జర్నలిజం లక్ష్యం**
**జర్నలిస్టులపై పోలీసుల చర్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం !**
**వ్యవస్థల్లో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టడమే జర్నలిజం**
**సీనియర్ పోలీస్ అధికారికి సమన్లు..**
**పత్రికా స్వేచ్ఛను కాపాడాలి: డా. బరిగెల శివ డిమాండ్**

**జై భీమ్ స్పెషల్ న్యూస్, న్యూఢిల్లీ**

ఢిల్లీలో జర్నలిస్టులపై పోలీసుల చర్యలు, విధుల నిర్వహణలో అడ్డంకులు కల్పిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు స్పందించినట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో సీనియర్ పోలీస్ అధికారిని వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించినట్లు సమాచారం. జర్నలిస్టులు, న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించకుండా అడ్డుకోవద్దని కోర్టు హెచ్చరించినట్లు పేర్కొనబడింది. ఈ పరిణామాలపై ఆల్ ఇండియా ఎడిటర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. బరిగెల శివ స్పందిస్తూ, జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, విధులు నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు భయాందోళనలు లేకుండా పనిచేసే వాతావరణాన్ని ప్రభుత్వాలు, పోలీసు శాఖ కల్పించాలని కోరారు. వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులను అడ్డుకోవడం, దాడులకు పాల్పడటం, వారి వృత్తిపరమైన విధులకు ఆటంకాలు కల్పించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలపై ప్రభావం చూపుతాయని బరిగెల శివ పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులకు సంబంధించిన ఫిర్యాదులను నిష్పక్షపాతంగా విచారించి, ఆరోపణలు రుజువైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ జర్నలిస్టులు, న్యాయవాదులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం, మీడియా ప్రతినిధులకు భద్రత కల్పించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమని స్పష్టం చేశారు. “జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి.. విధుల నిర్వహణకు ఆటంకాలు తొలగించాలి.. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి.. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి” అని ఆల్ ఇండియా ఎడిటర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. బరిగెల శివ డిమాండ్ చేశారు.

---

## రాయపర్తి మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలిగా సూదుల ఉమాదేవి పటేల్ ఎన్నిక

**బురాహాపల్లి సర్పంచ్‌కు కీలక బాధ్యతలు.. ఘనంగా సన్మానం**



**రాయపర్తి(జై భీమ్ న్యూస్)**

రాయపర్తి మండల సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలిగా బురాహాపల్లి గ్రామ సర్పంచ్ సూదుల ఉమాదేవి పటేల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళగా ప్రజాసేవలో బాధ్యతలు చేపట్టడం పట్ల గర్వంగా ఉందని, సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక కావడాన్ని ఒక వరంలా భావిస్తున్నానని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాయపర్తి మండల ఎంపీడీవో పాక శ్రీనివాస్, జడ్పీ సీఈఓ వసంత, ఎస్సై రాజేందర్ ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు.

## భారత్-వెస్టిండీస్ పోరుకు ఉప్పల్ సిద్ధం

**నాలుగో టీ20 మ్యాచ్‌కు భారీ ఏర్పాట్లు**
**హెచ్‌సీఏ, బీసీసీఐ సమన్వయంతో సన్నాహాలు**
**భద్రత, ప్రేక్షకుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**
**అంతర్జాతీయ క్రికెట్ సందడికి ఉప్పల్ వేదిక**
**భారత జట్టు ఆటను చూసేందుకు అభిమానుల ఆసక్తి**



**హైదరాబాద్, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించేందుకు హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సిద్ధమవుతోంది. భారత్--వెస్టిండీస్ జట్ల మధ్య జరగనున్న నాలుగో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాయి. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చే అవకాశం ఉండటంతో స్టేడియంలో ప్రేక్షకులకు అవసరమైన సౌకర్యాలు, మైదానం సిద్ధం చేయడం, టికెట్ల నిర్వహణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మ్యాచ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత విభాగాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. అంతర్జాతీయ మ్యాచ్‌కు వచ్చే ప్రేక్షకులకు మెరుగైన అనుభూతి కల్పించడంతోపాటు మ్యాచ్ ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. స్టేడియం పరిసరాల్లో రద్దీని నియంత్రించడం, ప్రేక్షకుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడటం వంటి అంశాలు కూడా కీలకంగా మారాయి. సొంత గడ్డపై భారత జట్టు ఆటను వీక్షించేందుకు అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు వెస్టిండీస్ జట్టు కూడా పోటాపోటీ ప్రదర్శన ఇచ్చే అవకాశం ఉండటంతో ఈ టీ20 సమరం ఆసక్తికరంగా మారనుంది. ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ సందడి నెలకొననుండటంతో హైదరాబాద్ మరోసారి అంతర్జాతీయ క్రికెట్‌కు కేంద్రబిందువుగా నిలవనుంది.

## పండుగ ప్రయాణాలకు 750కి పైగా ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

పండుగల సీజన్ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. దసరా, దీపావళి పండుగల సందర్భంగా 750కి పైగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే మార్గాల్లో ఈ ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. ఈ వివరాలను దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి (సీపీఆర్ఓ) శ్రీధర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. ప్రయాణికుల అవసరాలు, రద్దీకి అనుగుణంగా రైళ్ల సంఖ్యను మరింత పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పండుగల వేళ ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్టేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అదనపు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు, భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ద్వారా నిఘాను కట్టుదిట్టం చేసినట్లు వివరించారు. అయితే, ఈ ప్రత్యేక రైళ్లలో ప్రయాణించే వారు సాధారణ ఛార్జీల కంటే కొంత అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రైళ్లలో మూడో వంతు మేర అదనపు ఛార్జీని వసూలు చేయనున్నట్లు రైల్వే శాఖ స్పష్టం చేసింది. పండుగలకు సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ మార్పును గమనించి, అందుకు అనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికను రూపొందించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అడిషనల్ డీసీపీ కుమారుడి..

# అద్భుత ప్రతిభ

## జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వేముల శ్రీఅన్ను



**అండర్ 19 విభాగంలో అత్యంత విలువైన క్రీడా ఘనుడు**
**క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తిని కనపరుస్తున్నాడు**
**పిన్న వయసులోనే ఉన్నతంగా ఎదిగి చూపిస్తున్నాడు**
**10 మీటర్స్ ఎయిర్ పిస్తోల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు**
**అడిషనల్ డీసీపీ వేముల శ్రీనివాస్ కుమారుడు**
**శ్రీఅన్నుకు ప్రశంసల వెల్లువ**

**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తిని కనపరిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవడం ఎంత సులభమో ఉమ్మడి వరంగల్ జిల్లా హన్మకొండ ప్రాంతానికి చెందిన శ్రీఅన్ను తన క్రీడా స్ఫూర్తిని జాతీయస్థాయిలో కనపరచడం ఎత్తైన ఘనతను సాధించిన క్రీడాకారునిగా తన పేరును లిఖించుకోగలిగాడు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అడిషనల్ డీసీపీగా పని చేస్తున్న వేముల శ్రీనివాస్ కుమారుడు వేముల శ్రీఅన్ను అండర్ 19 ఏర్ ఫిస్తోల్ విభాగంలో ద్వితీయ స్థానం సంపాదించి ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు తెలంగాణ ప్రాంతం నుండి ఎంపిక చేయబడి తెలంగాణ కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాడు.(ఫ్రీ నేషనల్)ఈవెంట్ విభాగంలో మధ్యప్రదేశ్ భూపాల్ లో జరిగిన 10 మీటర్ల ఏర్ పిస్తోలు విభాగంలో అద్భుత ప్రతిభను కనపరిచి ద్వితీయ స్థానం సాధించడం వెనకాల కఠోరమైన శ్రమ క్రమశిక్షణతో కూడిన పట్టుదల క్రీడా స్ఫూర్తిపై తనకు ఉన్నటువంటి ఆసక్తి మమకారం తను ఎన్నిక చేయబడడానికి ప్రధాన కారణాలుగా నిలిచాయని పలువురు ప్రముఖులు శ్రీఅన్ను క్రీడా స్ఫూర్తిని అభినందిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూనే ప్రభుత్వం కల్పిస్తున్న క్రీడా స్ఫూర్తి అవకాశాలలో ఆణిముత్యం లాంటి క్రీడాకారులు వెలుగులోనికి వస్తుండగా అందులో ప్రతిభావంతమైన క్రీడా స్ఫూర్తిని కనపరిచే శ్రీఅన్ను వెలుగులోనికి రావడం ఉన్నత స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకోవడం రాష్ట్ర ప్రతిష్టను దేశస్థాయిలో ప్రకటించడం రాష్ట్రంలో యువ క్రీడాకారులకు ప్రత్యేక పోటీ తత్వాన్ని పెంచే విధంగా కనిపిస్తుందని పలువురు భావిస్తున్నారు.కాకతీయ డిగ్రీ కళాశాలలో బిబిఏ రెండవ సంవత్సరం చదువుతున్న శ్రీఅన్ను వచ్చే నెలలో ఢిల్లీలో జరగబోయే నేషనల్ షూటింగ్ కాంపిటీషన్లో పాల్గొనబోతున్న సందర్భంగా ప్రస్తుతం కనబరిచిన అద్భుత ప్రతిభను తను పాల్గొనబోయే క్రీడా టోర్నమెంట్లో సాధించాలని ఆశిస్తూనే యువ క్రీడాకారులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న కేడీసీ(ప్రభుత్వ) కళాశాల యాజమాన్యానికి ఫిజికల్ డైరెక్టర్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ యువ క్రీడాకారులను దేశస్థాయిలో రాణించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ దేశ స్థాయి క్రీడల్లో ఉన్నత ప్రతిభను కనపరిచే విధంగా శ్రీఅన్నును తీర్చిదిద్దుతున్న తన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందిస్తూ మరెన్నో ప్రతిభావంతమైన క్రీడా పథకాలను అందుకోవాలని తెలంగాణ ప్రజల తరపున శ్రీఅన్నును ప్రత్యేకంగా అభినందించనైనది.

# ఓరుగల్లు అభివృద్ధికి భారీ బూస్ట్..!




**66 డివిజన్లకు మహర్దశ..**
**20 లక్షల మందికి ఊరట!**
**మురుగునీటి సమస్యలకు చెక్..**
**మారనున్న మహా నగర రూపురేఖలు!**

**వరంగల్ కార్పొరేషన్, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

చారిత్రక ఓరుగల్లు నగరంలో మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా భారీ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు తెరపైకి వచ్చింది. సుమారు రూ.5,257 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే గ్రేటర్ వరంగల్ పరిధిలోని వరంగల్, హనుమకొండ నగరాల్లో మురుగునీటి నిర్వహణకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. 66 డివిజన్ల పరిధిలోని సుమారు 20 లక్షల జనాభాకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు వార్తా కథనం వెల్లడిస్తోంది.

**మురుగునీటి సమస్యలకు పరిష్కారం దిశగా..**

నగర జనాభా పెరుగుతున్నా, అందుకు అనుగుణంగా మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడంతో పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బహిరంగ కాలువలు పొంగిపొర్లడం, మురుగునీరు రోడ్లపై ప్రవహించడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు పారిశుద్ధ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు ప్రాధాన్యం సంతరించుకుంది. ఆధునిక పైపులైన్లు, మురుగునీటి సేకరణ వ్యవస్థ, శుద్ధి కేంద్రాల ద్వారా వ్యర్థజలాలను క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడనుంది.

**66 డివిజన్లకు ప్రయోజనం**

ప్రతిపాదిత ప్రాజెక్టు ద్వారా నగరంలోని వివిధ ప్రాంతాలను భూగర్భ డ్రైనేజీ నెట్‌వర్క్‌తో అనుసంధానించనున్నారు. దీనివల్ల మురుగునీటిని బహిరంగ కాలువల్లోకి వదిలే పరిస్థితి తగ్గడంతోపాటు, పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడే అవకాశం ఉంది. మురుగునీటిని శుద్ధి చేసి పర్యావరణానికి హాని కలగకుండా నిర్వహించేందుకు కూడా అవకాశం ఏర్పడుతుంది. అయితే, ఏయే ప్రాంతాల్లో మొదట పనులు చేపడతారు? ప్రాజెక్టును ఎన్ని దశల్లో పూర్తి చేస్తారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**వర్షాకాల సమస్యలకు ప్రత్యేక చర్యలు అవసరం**

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థతో మురుగునీటి నిర్వహణ మెరుగుపడినప్పటికీ, వర్షపు నీరు నిలిచిపోయే సమస్యలకు ప్రత్యేక పరిష్కారాలు అవసరం. ఇందుకోసం వర్షపు నీటి కాలువల అభివృద్ధి, నాలాల పునరుద్ధరణ, నీటి ప్రవాహ మార్గాల్లో అడ్డంకుల తొలగింపు వంటి చర్యలను సమాంతరంగా చేపట్టాలి. రెండు వ్యవస్థలను సమన్వయంతో అభివృద్ధి చేసినప్పుడే నగర ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రయోజనం కలుగుతుంది.

**అమలుపైనే ప్రజల ఆశలు**

రూ.5,257 కోట్ల భారీ ప్రాజెక్టు కార్యరూపం దాల్చాలంటే నిధుల సమీకరణ, పరిపాలనా అనుమతులు, సాంకేతిక ప్రణాళికలు, పనుల పర్యవేక్షణ కీలకం కానున్నాయి. పనుల్లో జాప్యం జరగకుండా, నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా దీర్ఘకాలంగా మురుగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న కాలనీలకు ప్రాధాన్యం ఇవ్వాలి.ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదల, పనుల ప్రారంభం, పూర్తిచేసే గడువుపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రతిపాదనలు కార్యరూపం దాల్చి, పనులు నిర్ణీత సమయంలో పూర్తయితేనే ఓరుగల్లు నగరానికి ఆధునిక మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి వచ్చి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

- (జై భీమ్ అధికార ప్రతినిధి హన్మకొండశ్రీకాంత్)



# జనాభా గణన రెండో దశకు సన్నద్ధం

**క్షేత్రస్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ**






**వరంగల్, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

జనాభా గణన రెండో దశ నిర్వహణకు గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా నగర పరిధిలోని ఛార్జ్ క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. బల్దియా ప్రత్యేకాధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. జనాభా గణనలో భాగంగా తొలి దశలో చేపట్టిన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్ఓ) బ్లాకులను ఎన్యుమరేషన్ బ్లాకులుగా మార్చడం, వెబ్ పోర్టల్‌లో వివరాల నమోదు, బ్లాకుల కేటాయింపు వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ఇంటింటికీ వెళ్లి సేకరించాల్సిన వివరాలు, తొలి దశలో గుర్తించిన లోపాల సవరణ, జనాభా వివరాల్లో వ్యత్యాసాలను గుర్తించే విధానాలను శిక్షణలో వివరించారు. ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం సక్రమంగా నమోదు చేయడం, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడటంపై ప్రధానంగా దృష్టి సారించారు.హైదరాబాద్‌కు చెందిన సెన్సస్ విభాగం ప్రతినిధులు సీహెచ్ సతీష్, జూనియర్ టెక్నికల్ సూపర్‌వైజర్ ప్రశాంత్ సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఓ సత్యనారాయణ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ ఇసంపల్లి జోనా, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు కార్యాచరణ

**గ్రామాల వారీగా పంటల పరిస్థితిపై అంచనా వేయాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశాల నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. పంటలకు, సాగునీటి లభ్యతకు సంబంధించి గ్రామాల వారీగా పరిస్థితులను పరిశీలించి, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె పంటల పరిస్థితి, నీటి లభ్యత, ప్రత్యామ్నాయ సాగు విధానాలపై చర్చించారు. వరి పంటకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ఇందుకోసం గ్రామాల్లో సభలు నిర్వహించాలని సూచించారు.గ్రామాల వారీగా పంటల పరిస్థితి, సాగునీటి లభ్యతను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్న గ్రామాలు, నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి వనరుల లభ్యతకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.రానున్న వ్యవసాయ సీజన్‌లో నీటి ఎద్దడి తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు అవసరమైన సాగు సూచనలు అందించాలని ఆదేశించారు.సమీక్షలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీఆర్డీవో నాగ పద్మజ, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలాజీ, సీపీఓ చంద్రకళ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# కేయూ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా డాక్టర్ పి. శ్రీనివాస్

**రెండేళ్ల పాటు బాధ్యతలు.. ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్**



**కేయూ క్యాంపస్,13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగ నూతన అధిపతిగా డాక్టర్ పి. శ్రీనివాస్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం రెండేళ్ల కాలానికి ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ టి. శాస్త్రి నుంచి డాక్టర్ పి. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన నియామకంపై విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## కొత్తపేటలో స్మార్ట్ రేషన్ కార్డులపై అవగాహన కార్యక్రమం

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాలతో కార్యక్రమం నిర్వహణ**



**వర్ధన్నపేట,13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు వరంగల్‌లోని మూడో డివిజన్ కొత్తపేటలో స్మార్ట్ రేషన్ కార్డులకు సంబంధించి కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఈసంపల్లి అనిల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు కే. అరుణ, రత్నవేణి, సుగుణతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు గాదె రామ్ లక్ష్మణ్, డివిజన్ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, ఎనకతల విజేందర్ రెడ్డి, ఎడ్ల చిరంజీవి, సిలువరి ఏలియా, రమ, సంజీవ్, రవి, ఐలయ్య, బాబు, మేకల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కొత్తపేటకు చెందిన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులకు సంబంధించిన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న నాయిని నీలిమ రెడ్డి

**శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు..**
**సాంస్కృతిక కార్యక్రమాల వీక్షణ**





**హనుమకొండ, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తులతో కిటకిటలాడుతున్న భద్రకాళి ఆలయంలో నాయిని నీలిమ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని నాయిని నీలిమ రెడ్డి అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. కళలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రతిభను చాటుకున్న వారిని ప్రోత్సహించడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భద్రకాళి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి భావంతో పాటు సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతున్నాయి. ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## జగనన్న కాలనీల లబ్ధిదారులకు బిగ్ అలర్ట్..

**విజయవాడ, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌లోని జగనన్న కాలనీలలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు సంబంధించి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఒక అతిముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన ప్లాట్లలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి సిద్ధంగా ఉన్నారో లేదో ప్రత్యక్షంగా తెలుసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకోవడం ఇష్టం లేని లబ్ధిదారులకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రాంతాలలో స్థలాలు కేటాయించే అంశాన్ని నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఈ విషయంలో లబ్ధిదారుల స్పష్టమైన అభిప్రాయాన్ని సేకరించడానికి వారికి త్వరలోనే అధికారిక నోటీసులు పంపనున్నట్లు వెల్లడించారు. ఈ సమస్యను సమగ్రంగా పరిష్కరించేందుకు గృహనిర్మాణ మంత్రి పార్థసారథి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మంత్రులు కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్‌లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. గతంలో కేటాయించిన కాలనీల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల చాలామంది అక్కడ ఇళ్లు కట్టడానికి వెనుకాడుతున్నారని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, లబ్ధిదారులు వద్దనుకున్న ప్లాట్ల రిజిస్ట్రేషన్లను తక్షణమే రద్దు చేసి, వాటిని అర్హులైన ఇతర పేదలకు పునఃకేటాయించాలని స్పష్టం చేశారు. మ్యాప్‌లు చూడండిఇటీవల నిర్వహించిన 'ఆవాస్' సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2 లక్షల మందికి ఇళ్ల స్థలాలు అవసరమని తేలడంతో, వారి కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. అదే సమయంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల సేకరణ పేరుతో జరిగిన భారీ అక్రమాలు, అక్రమ లావాదేవీలపై సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించడంతో ఏపీ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేగుతోంది.

## కాకతీయ ఇంజినీరింగ్ కళాశాలలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**రంగురంగుల ముగ్గులు.. సంప్రదాయ ఆటపాటలతో సందడి**





**కేయూ క్యాంపస్,13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**




కాకతీయ ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటుకున్నారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేస్తూ పండుగ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. భావితరాలకు తెలంగాణ సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేసేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ వేడుకల నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులను అభినందించడంతో పాటు, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సమిష్టిగా పాల్గొనడంతో కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి.

## కలెక్టరేట్‌లో రేపు బతుకమ్మ సంబరాలు

**ముగ్గులు, పాటలు, అంత్యాక్షరి..**
**పలు పోటీల నిర్వహణ**

**వరంగల్, 13 అక్టోబరు 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో అక్టోబరు 14న బుధవారం ఘనంగా సంబరాలు నిర్వహించనున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానుండగా, మహిళా ఉద్యోగులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉద్యోగులందరికీ పాటల పోటీలు, అంత్యాక్షరి, స్టాండప్ కామెడీ పోటీలు జరగనున్నాయి. అలాగే వివిధ శాఖల మధ్య ఉత్తమ బతుకమ్మ, ఉత్తమ వేషధారణ, ఉత్తమ బిందీ పోటీలను నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేలా వేడుకలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని అధికారులు, మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద కోరారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి..

**ముగ్గురు అరెస్ట్.. రూ.17,300 నగదు స్వాధీనం**

**మెదక్, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**



మెదక్ జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా కూల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని కూల్చారం గ్రామానికి చెందిన సత్యనారాయణ, శేఖర్, నర్సింలుగా గుర్తించారు. పేకాటకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

## ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతా?

**ప్రజాస్వామ్య హక్కులపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందన్న కిషన్ రెడ్డి**
**తెలంగాణలో బీజేపీ నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని ఆరోపణ**

**హైదరాబాద్, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

ప్రజాస్వామ్య హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలు స్వేచ్ఛగా నిరసనలు చేస్తుంటే అనుమతిస్తున్నామని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం బీజేపీ నేతల నిరసనలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో రైతుల సమస్యలు, పోలీసు నియామకాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వంటి ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు ప్రయత్నిస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో సహా పలువురు నేతలను గృహ నిర్బంధం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రధాని మోదీని, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను, సైన్యాన్ని విమర్శిస్తున్నా ఆయన హక్కులను కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేతలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులు... తెలంగాణలోని బీజేపీ నేతలకు ఎందుకు ఉండవు? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుంటే సరిపోదని, అధికారంలో ఉన్నప్పుడు దానిని ఆచరించాలని హితవు పలికారు. 1975లో ఎమర్జెన్సీ విధించి ప్రతిపక్ష నేతలను జైళ్లలో పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆయన గుర్తుచేశారు.

# బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి





**వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి**
**పర్యాటక ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి**
**ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్**

**వరంగల్, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలని, సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణ, పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు**

గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని వాణీ ప్రసాద్ సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సేకరించి విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

**బతుకమ్మ పాటలతో పర్యావరణంపై అవగాహన**

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై చూపే ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. బతుకమ్మ పాటల పోటీల్లో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటి పొదుపు వంటి అంశాలను చేర్చాలని తెలిపారు. మహిళా సంఘాలు, యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ఆదేశించారు.

**పర్యాటక అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**

రాష్ట్రవ్యాప్తంగా 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు వాణీ ప్రసాద్ తెలిపారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించాలన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్) తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధి, భూమి లభ్యత, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, మౌలిక సదుపాయాలు, పనుల గడువును నివేదికల్లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

**పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు ప్రోత్సాహం**

పాక్షికంగా పూర్తయిన హరిత హోటళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని వాణీ ప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న ప్రైవేట్ పెట్టుబడిదారులను గుర్తించి, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాల్లోని చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను గుర్తించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు స్వదేశ్ దర్శన్ కార్యక్రమం ద్వారా నిధులు సమకూర్చుకునే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన చోట ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

**పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం : కలెక్టర్**

వరంగల్ జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అపారమైన అవకాశాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. పర్యావరణ పర్యాటకం, చారిత్రక కట్టడాలు, పురాతన ఆలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించినట్లు వివరించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, పురాతన దేవాలయాలను పరిశీలించి, వాటి అభివృద్ధికి సంబంధించిన పూర్తి నివేదికలను సిద్ధం చేసి సమర్పిస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన వివరాలను సేకరించి, సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో విజయలక్ష్మి, కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, యువజన, క్రీడల అధికారి, పర్యాటక శాఖ ఇన్‌చార్జి అనిల్, పురావస్తు శాఖ అధికారి గంగా తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**పార్టీ నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం**
**ఢిల్లీలో సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**న్యూఢిల్లీ, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఢిల్లీలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ విజయాలను కొనసాగించేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# మంథనిలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులు పట్టివేత

**మంథని, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు చిన్న ట్రాలీలలో ఆవులను కరీంనగర్‌కు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న, ఎండీ తుఫాన్ కలిసి 11 ఆవులను రెండు చిన్న ట్రాలీలలో కరీంనగర్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. పట్టుకున్న ఆవులను, అలాగే నిందితులను తదుపరి విచారణ నిమిత్తం మంథని పోలీసులకు అప్పగించారు.



# మా బతుకులు ఎలా సాగాలి?







**చిరువ్యాపారుల పొట్టకొట్టిన తొలగింపులు..**
**ఉపాధి చూపలేకపోయినా.. ఉన్న ఉపాధినీ దూరం చేస్తారా?**
**ముందస్తు సమాచారం లేదు..**
**గడువు ఇవ్వలేదు.. పరిహారం అందలేదు**
**నష్టపోయిన చిరువ్యాపారులకు న్యాయం చేయాలని నగరవాసుల డిమాండ్**

**కాకతీయ యూనివర్సిటీ, 13 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు.. రోజంతా కష్టపడితేనే ఇంట్లో పొయ్యి వెలిగే పరిస్థితి.. కుటుంబాన్ని పోషించుకోవడానికి రోడ్డుపక్కన చిన్న డబ్బాలు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్న చిరువ్యాపారుల జీవితాల్లో తొలగింపులు చీకట్లు నింపాయి. యూనివర్సిటీ క్రాస్‌రోడ్డు నుంచి భీమారం వరకు రహదారికి ఇరువైపులా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పలువురి దుకాణాలను, వస్తువులను తొలగించడంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్న ఉపాధిని తీసేశారు.. మరి మా బతుకులు ఎలా?**

ఉద్యోగాలు లేక, కుటుంబ పోషణకు మరో మార్గం కనిపించక చిన్నపాటి వ్యాపారాలను నమ్ముకుని జీవిస్తున్నామని బాధితులు చెబుతున్నారు. రోడ్డుపక్కన చిన్న డబ్బా ఏర్పాటు చేసుకుని టీ, టిఫిన్లు, ఇతర వస్తువులు విక్రయిస్తూ వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు. పెద్ద వ్యాపారాలు చేసే స్థోమత లేకపోయినా, ఎవరి ముందు చేయి చాచకుండా స్వయంగా కష్టపడి బతకాలనే ఉద్దేశంతో ఈ వ్యాపారాలు చేస్తున్నామని అంటున్నారు. అయితే తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తమ వస్తువులను సురక్షితంగా తీసుకునేందుకు కనీస సమయం కూడా కల్పించకుండా తొలగింపు చర్యలు చేపట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్యలతో తమ వ్యాపార సామగ్రి దెబ్బతిని, తిరిగి ఉపయోగించలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆక్రమణల తొలగింపా.. పేదల ఉపాధికి శిక్షా?**

రహదారులపై ట్రాఫిక్ సమస్యలు, ఆక్రమణలను తొలగించడం అధికారుల బాధ్యతే. అయితే అదే సమయంలో చిన్న వ్యాపారుల జీవనోపాధి, వారి కుటుంబాల భవిష్యత్తును కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. రోడ్లపై వ్యాపారాల వల్ల ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ స్థలాలు చూపించి, తగిన సమయం ఇచ్చి చర్యలు తీసుకుంటే బాగుండేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేకపోయినా.. స్వయంగా ఉపాధి పొందుతున్న పేదల బతుకులను కూడా దెబ్బతీయడం ఎంతవరకు సమంజసం? అన్న ప్రశ్న బాధితుల నుంచి వినిపిస్తోంది. ఒక చిన్న డబ్బా వారికి కేవలం వ్యాపార స్థలం మాత్రమే కాదు.. పిల్లల చదువులకు ఆధారం, కుటుంబానికి అన్నం పెట్టే మార్గం, అప్పులు తీర్చుకునే ఆశ. ఆ డబ్బా తొలగిపోతే వారి ఆదాయమే కాదు.. కుటుంబం మొత్తం ఆధారపడిన జీవనాధారం కూడా దెబ్బతింటుంది.

**నష్టపరిహారం ఇవ్వాలి.. ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలి**

తొలగింపు చర్యల్లో నష్టపోయిన తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని చిరువ్యాపారులు కోరుతున్నారు. దెబ్బతిన్న వ్యాపార సామగ్రికి తగిన పరిహారం అందించాలని, యూనివర్సిటీ క్రాస్‌రోడ్డు నుంచి భీమారం వరకు ఉన్న ప్రాంతంలో లేదా సమీపంలోని అనువైన ప్రదేశాల్లో చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నగర అభివృద్ధి పేరుతో రహదారులను విస్తరించడం, ఆక్రమణలను తొలగించడం అవసరమే అయినా.. ఆ అభివృద్ధి వల్ల పేదల జీవితాలు ఛిన్నాభిన్నం కాకూడదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. చిరువ్యాపారులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం, వారి నష్టాన్ని పరిశీలించడం, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలని కోరుతున్నారు. రోడ్డుపక్కన చిన్న డబ్బా పెట్టుకుని బతకడం నేరం కాదు.. ఎవరికీ భారం కాకుండా కష్టపడి జీవించాలనుకోవడం వారి హక్కు. అభివృద్ధి జరగాలి.. కానీ పేదల కళ్లలో కన్నీళ్లు మిగలకుండా జరగాలి. చిరువ్యాపారుల కన్నీళ్లను తుడిచి, వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# కాకినాడ కార్పొరేషన్‌పై జనసేన కన్ను..

**వైసీపీకి కోలుకోలేని దెబ్బ..!**

**కాకినాడ, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరిన వేళ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో కీలకమైన మేయర్ స్థానాలను ఎలాగైనా కైవసం చేసుకోవాలనే వ్యూహంతో జనసేన పార్టీ అడుగులు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే పెద్దాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కూటమి సీట్ల సర్దుబాటులో జనసేన పార్టీ దక్కించుకోబోయే మున్సిపల్ కార్పొరేషన్లు, ముఖ్యంగా కాకినాడ వంటి కీలక మేయర్ స్థానాల్లో క్షేత్రస్థాయి బలాన్ని పెంచుకోవడంపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. వైపక్ష వైఎస్సార్సీపీని రాజకీయంగా దెబ్బకొట్టడమే కాకుండా, ఆ పార్టీలోని బలమైన సామాజిక వర్గాల నేతలను, ఆర్థికంగా అండదండలు ఉన్న నాయకులను తమవైపు తిప్పుకోవడంలో జనసేన సఫలీకృతమవుతోంది. క్షేత్రస్థాయిలో పట్టున్న వైసీపీ నేతలను వరుసగా పార్టీలోకి చేర్చుకోవడం ద్వారా ప్రతిపక్షాన్ని కోలుకోలేని దెబ్బ తీసేలా జనసేన వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. పెద్దాపురం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్సీపీకి పట్టున్న డివిజన్లు మరియు గ్రామాల్లోని ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇప్పుడు జనసేన వైపు మొగ్గు చూపుతోంది. జనసేన పోటీ చేయాలనుకుంటున్న కార్పొరేషన్ పరిధిలోని వార్డుల్లో గెలుపు గుర్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవడానికి ఈ వలసలు బాగా ఉపయోగపడనున్నాయి. క్షేత్రస్థాయిలో తమ పార్టీ బలాన్ని భారీగా పెంచుకోవడం ద్వారా, కూటమి సీట్ల సర్దుబాటు చర్చల్లో ఎక్కువ వార్డులు మరియు మేయర్ స్థానాలను దక్కించుకోవచ్చనేది జనసేన అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది. అటు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రీజనల్ కోఆర్డినేటర్లతో భేటీ అయి మేయర్ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో పడగా.. ఇటు పవన్ కళ్యాణ్ ఆ పార్టీలోని కీలక నేతలను జనసేనలోకి లాగుతూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్సీపీకి గట్టి సవాల్ విసురుతున్నారు. రాబోయే రోజుల్లో గోదావరి జిల్లాల నుంచి మరికొంత మంది ప్రతిపక్ష నేతలు జనసేన బాట పట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

**పవన్ కల్యాణ్ రాజకీయ శంఖారావం**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ శంఖారావం పూరించారు. పోలవరం జిల్లాలో నిర్వహించిన అడవితల్లి బాట కార్యక్రమమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పోరుకు శ్రేణులను సమాయత్తం చేస్తూ, క్షేత్రస్థాయిలో కూటమి విజయానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలని కార్యకర్తలకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. జనసేనకు అనుకూలంగా నినాదాలు చేస్తున్న వారిని వారించి కూటమి గురించి ప్రత్యేకంగాప్రస్తావించారు. సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమం కోసం జనసైనికులు ఎంతో త్యాగం చేశారని కొనియాడారు. ఎలాంటి పదవులూ ఆశించకుండా కేవలం కూటమి విజయమే ధ్యేయంగా పనిచేసిన తీరు అభినందనీయమని ప్రశంసించారు. రాబోయే స్థానిక పోరులో కూడా అదే ఐక్యతను చాటాలని, కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త శ్రమించాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి వార్డు స్థాయి వరకు కూటమి భాగస్వామ్య పక్షాలు కలిసికట్టుగా పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఇకపై కేవలం అభివృద్ధిపైనే పూర్తి దృష్టి సారించామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సినిమాల్లో రెండు గంటల్లో మార్పు వచ్చినట్లు నిజ జీవితంలో జరగదు. ప్రజాక్షేత్రంలో నిరంతరం కష్టపడి పనిచేయడమే ముఖ్యం అని జనసైనికులకు స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల పురోగతి కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని, ఏడు జిల్లాల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులు, మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. సీఎం చంద్రబాబు నాయుడి అపార అనుభవంతో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందని, స్థానిక పోరులో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇదే సమయంలో పార్టీ అంతర్గత క్రమశిక్షణ, ప్రజాప్రతినిధుల ప్రవర్తనపై కూడా పవన్ పరోక్షంగా కఠిన సంకేతాలు ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు ప్రజలకు పారదర్శకంగా, అవినీతిరహితంగా సేవలందించాలని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతామని వెల్లడించారు.

## రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం

**హైదరాబాద్ అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్.. పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు.. కనీసం గతంలో అందిన సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు. గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు.. కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి. పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం.

# అభ్యర్థుల ఎంపికపై పూర్తి స్థాయిలో ఫోకస్

**విజయవాడ, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఊపందుకోవడంతో ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపికపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. కూటమి ప్రభుత్వానికి గట్టి పోటీ ఇచ్చేలా బలమైన నేతలను బరిలోకి దించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, సీనియర్ నాయకులతో అత్యంత కీలకమైన సమావేశాన్ని నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థుల ఎంపికను వీలైనంత త్వరగా పూర్తి చేసి క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని ముమ్మరం చేయాలని జగన్ భావిస్తున్నారు. స్థానిక సమరంలో అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించి సైకలాజికల్ అడ్వాంటేజ్ దక్కించుకోవాలనే వ్యూహంతో వైఎస్సార్‌సీపీ ఉంది. ఇందులో భాగంగానే ఇప్పటికే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా సీనియర్ నేత ఆనం విజయ్‌కుమార్ రెడ్డి పేరును వైఎస్ జగన్ అధికారికంగా ఖరారు చేశారు. రిజర్వేషన్ల సమీకరణాలను బేస్ చేసుకుని రేపు జరగబోయే రీజనల్ కోఆర్డినేటర్ల సమావేశంలో మిగిలిన ప్రధాన నగరాల మేయర్ అభ్యర్థుల ఎంపికపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన కీ-కార్పొరేషన్లపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరగనుంది. విజయవాడ, గుంటూరు, వైజాగ్, కాకినాడ, ఒంగోలు, కడప, అనంతపురం నగరాల మేయర్ అభ్యర్థులను రేపటి సమావేశం ముగిసిన అనంతరం వైఎస్ జగన్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో బలమైన ప్రచారం సాగుతోంది. ఇప్పటికే గుంటూరు మేయర్ స్థానానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు కుమార్తె పేరు కూడా పరిశీలనలోకి వచ్చినట్లు లీకులు వస్తుండటంతో, రేపటి అధికారిక లిస్ట్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు, అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేయాలని రీజనల్ కోఆర్డినేటర్లకు వైఎస్ జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు. పోలింగ్ బూత్ ల వారీగా నిఘా ఉంచడం, అభ్యర్థుల ఆర్థిక, సామాజిక బలాలను అంచనా వేయడం వంటి అంశాలపై సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి తదితర ప్రాంతీయ సమన్వయకర్తలతో జగన్ వన్-టు-వన్ సమీక్షించనున్నారు. రేపటి ప్రకటనతో ఏపీ మున్సిపల్ ఎన్నికల రాజకీయం మరింత ఊపందుకోనుంది.



రాజకీయాల్లో సామాజిక వర్గాల సమీకరణాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే కేవలం కుల సమీకరణాలను ఆధారంగా చేసుకుని ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యం కాదు. ప్రజల్లో పలుకుబడి, స్థానిక సమస్యలపై అవగాహన, నాయకుడి బలం, పార్టీ శ్రేణులతో సంబంధాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికైనా పరిగణనలోకి తీసుకోవాలనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో తీసుకున్న కొన్ని నిర్ణయాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడంతో పార్టీ వ్యూహాలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంగళగిరి నియోజకవర్గంలో జరిగిన పరిణామాలు ఈ చర్చకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. గతంలో బలమైన స్థానిక నాయకుడిగా గుర్తింపు పొందిన ఆళ్ల రామకృష్ణారెడ్డిని పక్కనపెట్టి, మురుగుడు లావణ్యకు అవకాశం కల్పించడం ద్వారా బీసీ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ భావించింది. అయితే ఎన్నికల్లో ఆమె విజయం సాధించలేకపోయారు. ఓటమి తర్వాత నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడంపై కూడా మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక సమీకరణాలతో పాటు అభ్యర్థి స్థానిక బలం, ప్రజలతో అనుబంధాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ పరిణామం గుర్తుచేస్తోంది. విజయవాడ నగర రాజకీయాల్లోనూ ఇలాంటి చర్చ కనిపిస్తోంది. నగర మేయర్ పదవి విషయంలో బీసీ మహిళకు అవకాశం కల్పించాలనే నిర్ణయాన్ని వైసీపీ తీసుకుంది. ఈ క్రమంలో రాయన భాగ్యలక్ష్మి మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆమె నాయకత్వం, నగర రాజకీయాల్లో పార్టీకి వచ్చిన ప్రయోజనాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన స్థానాల్లో సామాజిక ప్రాతినిధ్యాన్ని పెంచడం ఎంత ముఖ్యమో, ఆ పదవుల్లో ఉన్నవారు ప్రజల్లో గుర్తింపు సంపాదించడం, పార్టీకి రాజకీయంగా ఉపయోగపడటం కూడా అంతే ముఖ్యమనే వాదన వినిపిస్తోంది. గత ఎన్నికల్లో విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో కూడా వైసీపీ ప్రయోగం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయాలు ఎన్నికల్లో విజయంగా మారకపోవడంతో అభ్యర్థుల ఎంపిక విధానంపై సమీక్ష అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడం తప్పు కాదు. అయితే అభ్యర్థి సామర్థ్యం, స్థానికంగా ఉన్న బలం, ఎన్నికల నిర్వహణలో అనుభవం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రస్తుతం వైసీపీ ముందున్న మరో ప్రధాన సమస్య పార్టీలోని అంతర్గత విభేదాలు. కొన్ని నియోజకవర్గాల్లో సమన్వయకర్తలు, సీనియర్ నాయకుల మధ్య విభేదాలు పెరుగుతున్నాయనే చర్చ ఉంది. వీటిని పరిష్కరించకుండా వదిలేస్తే పార్టీ కేడర్‌పై ప్రభావం పడే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికలకు ముందే నాయకుల మధ్య సమన్వయం పెంచడం, నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయడం అవసరం. సామాజిక సమీకరణాలు రాజకీయాల్లో ముఖ్యమైనవే అయినప్పటికీ అవే విజయానికి హామీ ఇవ్వవు. బలమైన నాయకత్వం, ప్రజలతో నిరంతర సంబంధాలు, సమర్థమైన అభ్యర్థుల ఎంపిక, అంతర్గత సమస్యల పరిష్కారం కూడా కీలకం. ఈ అంశాలపై వైసీపీ నాయకత్వం దృష్టి పెట్టకపోతే భవిష్యత్తు ఎన్నికల్లో సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. పార్టీ పునరుద్ధరణకు వ్యూహాత్మక మార్పులు ఎంతవరకు ఉపయోగపడతాయన్నది జగన్ తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

# కూటమికి బీసీ నినాదం

**కాకినాడ, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**




ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కార్డు కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా అత్యంత కీలకం కానుంది. జనాభాలో సగానికి పైగా ఉన్న వెనుకబడిన తరగతులను తమ వైపు తిప్పుకునేందుకు కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తొలి నుంచి టీడీపీకి బీసీలు అండగా నిలుస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల్లోనూ బీసీలు కూటమి అభ్యర్థుల విజయానికి అండగా నిలిచారు. అయితే బీసీ పురుషులు యాభై ఏళ్లు నిండిన వారికి పింఛన్లు, మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న కూటమి నేతల హామీలు నెరవేరలేదు. దీంతో కొంత వెనకబడిన వర్గాల్లో అసంతృప్తి ఉంది. అయితే ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో అది పెద్దగా పనిచేయదని, స్థానిక సంస్థలలో డబుల్ ఇంజిన్ సర్కార్ ను మాత్రమే చూస్తారని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల ను రాజకీయంగా కల్పించేందుకు సిద్ధమయింది.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే తమ మేనిఫెస్టో హామీకి కట్టుబడి ఉన్నామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. న్యాయపరమైన చిక్కులు ఎదురైనప్పటికీ, బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం, ప్రాతినిధ్యం కల్పించడమే తమ ధ్యేయమని ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త కోటా లెక్కల ద్వారా స్థానిక సంస్థల్లో సుమారు 4,000 పైగా అదనపు స్థానాల్లో బీసీలకు అవకాశం లభించనుందని నివేదికలు చెబుతున్నాయి. అయితే అన్నీ బీసీ వర్గాలకు ఇస్తే మిగిలిన సామాజికవర్గాల్లో వ్యతిరేకత వస్తుందేమోనన్న అభిప్రాయం కూడా ఉంది. ఇన్నాళ్లు తాము పార్టీ కోసం పనిచేసింది పదవులు వస్తాయని, అలాంటిది రిజర్వేషన్ల పేరుతో తమను దూరం పెడితే ఎలా? అన్న ప్రశ్న కూడా వారి నుంచి వినపడుతుంది. గతంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ నా బీసీ, నా ఎస్సీ, నా ఎస్టీ అంటూ గత ఎన్నికల్లో తక్కువ స్థానాలకే పరిమితమయిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరియు బీసీ సంఘాలు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా నిష్పత్తికి తగ్గట్లుగా న్యాయమైన వాటా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. కోర్టుల పరిధిలో రిజర్వేషన్ల అంశంపై జరిగిన పరిణామాలు ఓటర్లలో ఎలాంటి ప్రభావం చూపుతాయనేది ఆసక్తికరంగా మారింది. బీసీలను తమ సాంప్రదాయ ఓటు బ్యాంక్‌గా భావించే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి.. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఆమోదంతో బీసీల నమ్మకాన్ని గెలుచుకోవాలని చూస్తోంది. ఈ 'బీసీ కార్డు' మరియు రిజర్వేషన్ల అమలు తీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయవకాశాలను గణనీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే బీసీ కార్డును ఉపయోగించి ఇప్పటికే జనంలోకి వెళ్లేందుకు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అది ఏ మేరకు పనిచేస్తుందన్నది చూడాలి. ఆంధ్రప్రదేశ్ లో అత్యధిక శాతం ఓటర్లు బీసీలు ఉండటంతోవారిని ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు తమ దైన శైలిలో ప్రయత్నిస్తున్నాయి. మరి చివరకు ఎవరిని బీసీలు కరుణిస్తారన్నది చూడాలి.

# గీత దాటే వారికి ఫైనల్ డెడ్ లైన్

**అనంతపురం. అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక మెజారిటీతో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వానికి కొందరు ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు , ప్రజాప్రతినిధులకు అవినీతి రహిత, పారదర్శక పాలన అందించాలని పదే పదే దిశానిర్దేశం చేస్తున్నారు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు వ్యక్తిగతంగా పిలిపించి క్లాస్ పీకినా, హెచ్చరికలు జారీ చేసినా కొందరు నాయకులు మాత్రం తమ పాత అలవాట్లను మానుకోకపోవడం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ , పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుల వ్యవహారాలు రాష్ట్ర రాజకీయాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. అనంతపురంలో అధికారులు, వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్ల ఆరోపణలు రావడంతో పాటు ఆడియో క్లిప్పులు వైరల్ కావడం స్థానికంగా కలకలం రేపింది. మరోవైపు పోలవరం నియోజకవర్గంలో ఇసుక మైనింగ్ దందాలు, దేవుడి భూముల వివాదాలు, రూ.21 లక్షల డీలింగ్స్ ఆడియో లీక్‌లతో జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వార్తల్లో నిలిచారు. గతంలోనే పవన్ కళ్యాణ్ ఈయన్ను పిలిపించి హెచ్చరించినప్పటికీ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో, ఏకంగా ఓ హైలెవెల్ ఎంక్వైరీ కమిటీని నియమించి సీరియస్ యాక్షన్‌కు శ్రీకారం చుట్టారు. వీరిద్దరే కాకుండా రాయలసీమ, ఉత్తరాంధ్ర , కోస్తా జిల్లాలకు చెందిన మరికొందరు కూటమి ఎమ్మెల్యేలు కూడా అధికారులపై బెదిరింపులకు దిగడం, ఇసుక-మద్యం మాఫియాలతో చెయ్యి కలపడం, స్థానిక కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు డిమాండ్ చేయడం వంటి వివాదాల్లో చిక్కుకుంటున్నారు. మేము కష్టపడి అధికారాన్ని తెస్తే.. వీరు ఐదేళ్ల మైండ్‌సెట్‌తో దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అని స్థానిక క్యాడర్, కూటమి శ్రేణులు సోషల్ మీడియా వేదికగా బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. ఎమ్మెల్యేల అతివల్ల ప్రభుత్వం కష్టపడి తెచ్చుకుంటున్న మంచి పేరు కాస్తా తుడిచిపెట్టుకుపోతోందనే ఆగ్రహం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో కూటమి అధిష్టానాలు అంతర్గత సర్వేల ద్వారా ఎమ్మెల్యేల పనితీరు, వారిపై వస్తున్న అవినీతి ఆరోపణలపై పక్కా నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న స్పందన, సోషల్ మీడియా ట్రాకింగ్ ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదనే స్పష్టమైన సంకేతాలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేల స్వేచ్ఛా దోపిడీ వల్లే ప్రజలు వారిని తిరస్కరించారనే విషయాన్ని గుర్తుచేస్తూ, పార్టీ పరువు తీసే నాయకులను దూరం పెట్టడమే మేలనే అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతానికి మొదటి దశగా పోలవరం ఎమ్మెల్యేపై పవన్ కళ్యాణ్ కమిటీ నియామకంతో విచారణ ప్రారంభించగా, విచారణ నివేదికల ఆధారంగా అక్రమాలు రుజువైతే పార్టీ బాధ్యతల నుంచి తొలగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. టీడీపీలోనూ వివాదాస్పద ఎమ్మెల్యేలకు చంద్రబాబు లాస్ట్ అండ్ ఫైనల్ డెడ్‌లైన్ విధించినట్లు తెలుస్తోంది. మార్పు రాకపోతే రాబోయే రోజుల్లో వారిని శాసనసభాపక్షం నుంచి పక్కనబెట్టడం వంటి కఠిన చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమికి ఈ వివాదాస్పద ఎమ్మెల్యేల ప్రవర్తన పెద్ద పరీక్షగా మారింది. అధినేతలు కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, ఒకరిద్దరిపై బహిరంగంగా కఠిన చర్యలు తీసుకుంటేనే మిగిలిన నాయకుల్లో భయం, క్రమశిక్షణ నెలకొంటాయని సామాన్య ప్రజలతో పాటు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఉచిత విద్యుత్ కు ఎసరు పెట్టే కుట్ర..

**రైతు డిస్కమ్ ఏర్పాటు జీవోపై హరీశ్‌రావు సీరియస్**

**హైదరాబాద్ అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**



ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, సామాజికవేత్తలు, రైతులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవో17 జారీ చేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఉరేసేందుకే ఈ కుట్ర అని ప్రశ్నించారు. వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమిటి? రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. సర్కార్ నిర్వాకంతో అన్నదాత మరింత ఇబ్బందుల్లో పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే దిక్కు లేదు.. రేపు రైతు డిస్కం తో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉందని అన్నారు. రైతు మెడకు రైతు డిస్కం ఉచ్చు..ఉచిత విద్యుత్ పై చేతులెత్తేసేందుకే సర్కార్ కొత్త ఎత్తుగడ అని తెలిపారు. ?పంటలు ఎండి రైతు కన్నీరు పెడుతుంటే.. డిస్కంల పేరిట రేవంత్ సర్కార్ రాజకీయ చదరంగం ఆడుతున్నదని అన్నారు. జీవో ప్రకారం కొత్త డిస్కమ్ పరిధిలోకి 30,60,861 వ్యవసాయ కనెక్షన్లు, 512 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు, ఊటచెరువు, మిషన్ భగీరథ.. మొత్తంగా 30,62,853 కనెక్షన్లు రైతు డిస్కం కి బదిలీ చేశారని హరీశ్‌రావు తెలిపారు. ఇంత భారీ వ్యవస్థ నిర్వహణ కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా సాధ్యం అవుతుందని ఆయన ప్రశ్నించారు. కేవలం 25శాతం థర్మల్ పవర్ అలకేషన్ తో రైతులకు సాగు, ప్రజలకు తాగు నీళ్లకు అవసరం అయ్యే భారీ విద్యుత్ వ్యవస్థ ఎలా నడుస్తుందని నిలదీశారు. 6,15,651 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, 2.51 లక్షల సర్క్యూట్ కిలోమీటర్ల వ్యవసాయ ఎల్‌టీ లైన్లు.. వీటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేకపోతే రైతుల కష్టాలకు ఎవరు బాధ్యత వహిస్తారని అడిగారు. రాష్ట్ర విద్యుత్ కేటాయింపుల్లో ఇప్పటికే 53.28 శాతం థర్మల్ విద్యుత్తే ఉందని.. సౌర విద్యుత్తు వాటా 35.31 శాతం మాత్రమే అని హరీశ్‌రావు తెలిపారు. ఇందులో థర్మల్ 25%, సోలార్ 58%, హైడల్ మొత్తంగా 100% రైతు డిస్కమ్ కు కేటాయించారని అన్నారు. పగటి పూట మాత్రమే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయితే, రాత్రి పూట ఉండదని చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పే ప్రభుత్వం.. పగటిపూట మాత్రమే విద్యుత్ ఇచ్చి, రాత్రివేళ రైతులను చీకట్లోకి నెట్టబోతోందా అని అనుమానం వ్యక్తం చేశారు. 2325 ఎం.వి హైడల్ (జల విద్యుత్) పవర్ మొత్తం రైతు డిస్కమ్‌కే కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ హైడల్ పవర్ సాంకేతికంగా ఏడాదిలో కేవలం 3-4 నెలలు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. అంటే మిగతా 8 నెలలు రైతు డిస్కమ్‌కి ఈ విద్యుత్ అందుబాటులో ఉండదు. అప్పుడు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. కొత్త డిస్కమ్‌కు భారీ రుణాలు, బకాయిలను కేటాయిస్తూ.. దాని ఆర్థిక స్థిరత్వంపై ప్రభుత్వం ఏం భరోసా ఇస్తోంది? ఈ అప్పుల భారం చివరకు రైతులపై పడేయాలని చూస్తున్నారా? రైతు డిస్కమ్ పేరుతో వ్యవసాయ విద్యుత్ బాధ్యతలను వేరుచేసి, రేపు నష్టాల సాకుతో రైతులపై ఆంక్షలు విధించే ప్రమాదం లేదా అని నిలదీశారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని, 24 గంటల సరఫరాలో ఎలాంటి కోతలు ఉండవని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వగలదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేయకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లడం కుదరదని అన్నారు. కొత్త సంస్థ ఏర్పాటుతో అదనపు పరిపాలనా ఖర్చులు ఎంత? ఆ ఖర్చులను ఎవరు భరిస్తారు? ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల బదిలీపై పూర్తి వివరాలను ప్రభుత్వం బహిర్గతం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైతుల పేరుతో డిస్కమ్ ఏర్పాటు చేయడం గొప్ప కాదు.. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం ముఖ్యం. సంస్థల పేర్లు మార్చడం, కొత్త సంస్థలు ఏర్పాటు చేయడం కాదు.. రైతుల విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు..రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే వారి అభ్యంతరాలను పక్కనపెట్టి ఎందుకు ముందుకెళ్తున్నారు? ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు లేవనెత్తిన సందేహాలకు సమాధానం చెప్పకుండా చాటు మాటుగా జీవో జారీ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు భరోసా ఇవ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుల్లో అనుమానాలు, ఆందోళనలు ఎందుకు పెంచుతోందని అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. రైతు డిస్కమ్ వల్ల కలిగే ప్రయోజనాలు, ఆర్థిక భారం, సిబ్బంది నిర్వహణపై పూర్తి వివరాలు వెల్లడించాలని సూచించారు. రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లకూడదని చెప్పారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వెనుక రైతుల ప్రయోజనాలే లక్ష్యమైతే మా ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.. లేదంటే తక్షణం జీవో ఉపసంహరించుకోవాలి అని యావత్ రైతాంగం పక్షాన డిమాండ్ చేశారు.

## సన్న బియ్యం ఎగుమతికి తెలంగాణ ప్రణాళికలు




**హైదరాబాద్ , అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో పండుతున్న మేలురకం సన్న బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్లకు పరిచయం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఆసియా, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లోని కొనుగోలుదారులతో దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు కుదుర్చుకోవడంపై దృష్టి సారించింది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో జరిగిన 'అంతర్జాతీయ ప్రపంచ వరి సదస్సు (ఐడబ్ల్యుఆర్సీ) 2026'లో ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తన లక్ష్యాలను స్పష్టం చేసింది. ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, తెలంగాణ బియ్యాన్ని నేరుగా కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని అంతర్జాతీయ రిటైలర్లు, ఫుడ్ కంపెనీలు, ఎగుమతిదారులను ఆహ్వానించారు. కేవలం దేశీయంగా మిగులు నిల్వలను నిర్వహించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక విలువను సృష్టించడంపై దృష్టి సారించామని ఆయన వివరించారు. దేశీయ ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలు అమలు చేస్తామని తెలిపారు. గత సీజన్‌లో తెలంగాణలో 18.5 మిలియన్ టన్నుల వరి ఉత్పత్తి జరిగిందని, ఇది దేశ మొత్తం ఉత్పత్తిలో దాదాపు 12 శాతమని స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. విదేశీ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అధిక నాణ్యత కలిగిన సన్న, మేలురకం బియ్యాన్ని బ్రాండెడ్, ట్రేసబుల్ (ఎక్కడ పండిందో గుర్తించే వీలున్న) పద్ధతిలో సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు 30,000 టన్నుల బియ్యాన్ని విజయవంతంగా ఎగుమతి చేసిన అనుభవంతో ఈ కొత్త ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు ప్రభుత్వం ఎగుమతులపై దృష్టి సారిస్తుండగా, మరోవైపు రాష్ట్రంలో సన్న బియ్యం ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 'సన్న బియ్యం' పీడీఎస్ పథకం కింద ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం సేకరించడం, కొన్ని జిల్లాల్లో వరి సాగు తగ్గడం, ఎల్ నినో ప్రభావంపై ఆందోళనల కారణంగా బహిరంగ మార్కెట్‌లో బియ్యం లభ్యత తగ్గింది. దీంతో కొద్ది వారాల క్రితం కిలో రూ.70 ఉన్న సన్న బియ్యం ధర ఇప్పుడు రూ.80-82కి చేరింది. 25 కిలోల బస్తా ధర రూ.2,150 సమీపంలో పలుకుతోంది. ఇదే సమయంలో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సేకరణ వ్యయం అధికంగా ఉండటంతో ఎగుమతుల్లో పోటీని తట్టుకోలేకపోతున్నామని కొందరు మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. థాయ్‌లాండ్, వియత్నాం నుంచి తక్కువ ధరకే బియ్యం అందుబాటులో ఉండటం మధ్యప్రాచ్యం, పశ్చిమాఫ్రికా మార్కెట్లలో భారత బియ్యంపై ప్రభావం చూపుతోందని వారు పేర్కొంటున్నారు. అయితే, దేశీయ అవసరాలు, రైతుల నుంచి ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యం ఇస్తూనే ఎగుమతి అవకాశాలను అన్వేషిస్తామని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

## దీదీ.... దయనీయమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు.

**బెంగాల్, అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాల పాటు ఎదురులేని శక్తిగా చక్రం తిప్పిన దీదీ మమతా బెనర్జీ నేడు తన రాజకీయ జీవితంలోనే అత్యంత దయనీయమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వామపక్షాల మూడు దశాబ్దాల కంచుకోటను బద్దలుకొట్టి తృణమూల్ కాంగ్రెస్ ని అధికారంలోకి తెచ్చిన నాటి దూకుడు, ఆమె సొంత పార్టీలోనే నిట్టనిలువునా చీలిక రావడంతో ఒక్కసారిగా ఆవిరైపోయింది. తిరుగుబాటు వర్గం మెజారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకుని అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాను దక్కించుకోవడమే కాకుండా, పార్టీ అసలు పేరు, చిహ్నంపై కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పైచేయి సాధించే దిశగా పావులు కదుపుతోంది. మెజారిటీ ప్రజాప్రతినిధులు రెబెల్ క్యాంప్ వైపు మొగ్గు చూపడంతో, మమత తన సొంత పార్టీతోనే పోరాడలేని అత్యంత బలహీనమైన స్థితికి దిగజారిపోయారు. ఈ రాజకీయ పతనానికి నిన్న మొన్నటి ఉపఎన్నికల ఫలితాలే తిరుగులేని నిదర్శనంగా నిలిచాయి. కేంద్ర ఎన్నికల సంఘం పార్టీ గుర్తును స్తంభింపజేసి తాత్కాలిక ఏర్పాట్లు చేసిన తర్వాత.. తన సొంత పేరునే పెట్టుకుని మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరిట బరిలోకి దిగినప్పటికీ ప్రజలు ఆమెను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఒకప్పుడు బెంగాల్ రాజకీయాలను శాసించిన ప్రజా నాయకురాలి పార్టీకి నియోజకవర్గాల్లో కనీసం మూడు వేల ఓట్లు కూడా రాలేదంటే, క్షేత్రస్థాయిలో ఆమె ప్రజాదరణ ఎంతటి పాతాళానికి పడిపోయిందో స్పష్టమవుతోంది. కార్యకర్తల యంత్రాంగం తిరుగుబాటు వర్గం వెంటే నడవటం, సాధారణ ఓటర్లు సైతం మమత గ్రూపును ఏమాత్రం నమ్మకపోవడంతో ఆమె పార్టీ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారింది. సొంత నేతలే వెన్నుపోటు పొడిచారన్న సానుభూతి కూడా ప్రజల్లో కనీస ప్రభావం చూపలేకపోయింది. ఇకపై ఒంటరిగా పోరాడి పార్టీని నిలబెట్టుకోవడం మమతా బెనర్జీకి అసాధ్యమైన పనిగా మారింది. ఎంపీల్లో ఎక్కువ మంది ఇప్పటికే బీజేపీ వైపు , ప్రత్యేక కూటముల వైపు కదలడం, బెంగాల్ అసెంబ్లీలో రెబెల్ నేతలే కీలకంగా మారడంతో మమత గ్రూపు కేవలం ఒక చిన్నపాటి అసమ్మతి గ్రూపుగా మిగిలిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో తన స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకోవాలని చూస్తే రాజకీయంగా పూర్తిగా కనుమరుగైపోవడం ఖాయం. అందువల్ల, గతంలో తృణమూల్ ఆవిర్భావానికి మూలమైన కాంగ్రెస్ పార్టీ వైపు మమత మళ్లీ చూడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. తాను స్థాపించిన పార్టీ చీలిక వర్గం చేతుల్లోకి వెళ్లిపోవడాన్ని చూస్తూ కూర్చోవడం కంటే, మిగిలిన తన బలాన్ని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడమే ఆమెకు మిగిలిన ఏకైక గౌరవప్రదమైన మార్గంగా కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో విలీనం ద్వారానే మమత జాతీయ స్థాయిలో తన గుర్తింపును కొంతవరకైనా కాపాడుకునే అవకాశం దక్కుతుంది. రాష్ట్రంలో విస్తరిస్తున్న బీజేపీని, తిరుగుబాటు తృణమూల్ వర్గాన్ని ఏకకాలంలో ఢీకొట్టే సంస్థాగత బలం ప్రస్తుతం మమత వద్ద లేకపోవడంతో.. జాతీయ పార్టీ గొడుగు కింద చేరితేనే మనుగడ సాధ్యమవుతుంది. కాంగ్రెస్‌తో కలవడం వల్ల కనీసం బెంగాల్‌లో లౌకిక ఓటు బ్యాంకును కొంతవరకైనా ఏకం చేయగలగడమే కాకుండా, కేంద్ర స్థాయిలో విపక్షాల కూటమిలో బలమైన స్వరాన్ని కొనసాగించవచ్చునని భావిస్తున్నారు. మరి మమతా బెనర్జీ ఏం సాధిస్తారో ?



## రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, 2027 ముప్పు

ప్రకృతి ప్రకోపించినప్పుడు ఏ ప్రభుత్వమైనా, ఎంతటి బలమైన వ్యవస్థ అయినా ఒక్కసారిగా కుదేలవుతుంది. అందులోనూ ఎల్ నినో వంటి వాతావరణ విపత్తులు పాలకులకు నిద్రలేకుండా చేసే అత్యంత క్లిష్టమైన సవాళ్లు. భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ అనూహ్య వాతావరణ మార్పులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాలను ఛిన్నాభిన్నం చేస్తాయి. నీరు అనేది లేకపోతే మానవ జీవనమే మూగబోతుంది. తాగునీరు కరవైతే జనజీవనం అస్తవ్యస్తమవుతుంది, సాగునీరు అందకపోతే అన్నదాత కన్నీరుమున్నీరవుతాడు. ఇటు తాగు, సాగు నీటి కొరత ఏర్పడితే జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పడిపోయి కరెంట్ కోతలు మొదలవుతాయి. తద్వారా పారిశ్రామిక ఉత్పాదకత దెబ్బతిని, నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతాయి. ఇదొక దుర్భిక్షపు విషవలయం. ప్రస్తుతం దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను కమ్ముకువస్తున్న ముప్పు కేవలం సాధారణ ఎల్ నినో కాదు. అంతకంటే ఎన్నో రెట్లు భీకరమైన సూపర్ ఎల్ నినో . రుతుపవనాలు చేతులెత్తేయడంతో ఈసార వర్షపాతం అంతంతమాత్రంగానే నమోదైంది. జలాశయాలు సగం కూడా నిండని దుస్థితిలో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని వచ్చే ఏడాది జూన్ వరకు తీవ్రమైన పొదుపుతో, అత్యంత అప్రమత్తంగా వాడుకోవాల్సిన కత్తిమీద సాములాంటి పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటిపోతున్న ఈ తరుణంలో పాలకులకు ఇది మునుపెన్నడూ లేని విధంగా అగ్నిపరీక్షగా మారింది. ఈ కరవు పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో ప్రజల్లో తీవ్రమైన అసహనం, ఆగ్రహం వ్యక్తమవడం సహజం. తాగునీరు అందక, విద్యుత్ కోట్లు పెరిగి, పంటలు ఎండిపోతున్న సమయాల్లో సగటు జీవి అగ్గిమీద గుగ్గిలమౌతాడు. ఈ సహజమైన ప్రజా అసహనాన్ని, నిరాశను పాలకులపై తిరుగుబాటుగా మలచడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్షాలు ఎప్పుడూ కాచుకుని కూర్చుంటాయి. ప్రభుత్వంపై బురదజల్లేందుకు, ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇదే అదనుగా భావిస్తాయి. అయితే, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటూ కేవలం పోలీసు బలంతోనో, ప్రకటనలతోనో ఈ విపత్తును నియంత్రించడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు. మరి ఈ పెనుముప్పు నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వాలు చేయాల్సింది ఏమిటి? ముందుగా పారదర్శకతతో కూడిన వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఉన్న నీటి వనరులు, విద్యుత్ లభ్యతపై ప్రతి పౌరుడికి ముందస్తు అవగాహన కల్పించాలి. నీటిని, కరెంటును ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో వివరిస్తూ ఒక ప్రజా ఉద్యమంలాంటి ప్రచారాన్ని చేపట్టాలి. ఈ సూపర్ ఎల్ నినో విపత్తును కేవలం ప్రభుత్వ సమస్యగా కాకుండా, ఇది మనందరి ఉమ్మడి సంక్షోభం అనే భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి గృహం, ప్రతి రైతన్న, ప్రతి పారిశ్రామికవేత్త నీటి పొదుపులో భాగస్వామ్యులుగా మారేలా విప్లవాత్మకమైన మార్గదర్శకాలను అమలు చేయాలి. ప్రజలను ఈ విపత్తు నిర్వహణలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రభుత్వాలపై భారం తప్పుతుంది, కాస్త రిలీఫ్ దొరుకుతుంది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం, విపరీతంగా వేడెక్కుతున్న సముద్రాలు రాబోయే కాలంలో ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికల ప్రకారం, ఈ సహజ వాతావరణ దృగ్విషయం డిసెంబర్‌లో శిఖరాగ్రానికి చేరుకుని 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది. గ్రీన్‌హౌస్ ఉద్గారాల వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలకు తోడు ఈ ఎల్ నినో ప్రభావం తోడవడంతో 2027 అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారవచ్చని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మానవ కార్యకలాపాల వల్ల వాతావరణంలో పెరుగుతున్న గ్రీన్‌హౌస్ ఉద్గారాలు భూమిని నిరంతరం వేడెక్కిస్తున్నాయి. దీనికి తోడు ఎల్ నినో కారణంగా సముద్రాల నుండి విడుదలయ్యే అదనపు వేడి వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తుంది. ఈ రెండు పరిణామాలు కలిసికట్టుగా పనిచేయడం వల్ల, రాబోయే 2027 సంవత్సరం రికార్డు స్థాయిలో అత్యంత ఉష్ణోగ్రతలు నమోదయ్యే సంవత్సరంగా మారే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణోగ్రతలలో వచ్చే మార్పుల వల్ల ఏర్పడే సహజ సిద్ధమైన వాతావరణ చక్రం. అయితే దీని ప్రభావం కేవలం ఆ ప్రాంతానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా టెలికనెక్షన్ ప్రభావం చూపుతుంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల్లో తీవ్రమైన వర్షాభావం, కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. దక్షిణ అమెరికాలోని పశ్చిమ తీర ప్రాంతాలు పెరూ, ఈక్వెడార్ వంటి దేశాలు భారీ వర్షాలు, ఆకస్మిక వరదలను ఎదుర్కొనే అవకాశం ఉంది. వాతావరణంలో వచ్చే ఈ తీవ్రమైన మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఆసియా, ఆస్ట్రేలియాలో వర్షపాతం తగ్గడం వల్ల గోధుమ, బియ్యం వంటి ప్రధాన పంటల దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల సముద్ర జీవగోళం, ముఖ్యంగా పగడపు దిబ్బలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. విపత్కర పరిస్థితులను దాటవేయడంలో పాలకుల ముందుచూపు, ప్రజల సహకారం రెండు చక్రాలలా పనిచేస్తాయి. కనీవినీ ఎరుగని ఈ నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఇప్పుడే కార్యాచరణ రూపొందించి, క్షేత్రస్థాయిలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి. లేదంటే, రాబోయే వేసవిలో ప్రజాగ్రహం తుఫానులా మారి ప్రభుత్వాల కొలువులను కూల్చడం తథ్యం. కాలం దాటిపోకముందే అప్రమత్తమై, ప్రతి చుక్క నీటిని భద్రపరిచే దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించడమే పాలకుల ముందున్న ఏకైక కర్తవ్యం.

## హైదరాబాద్ రవాణా ముఖచిత్రంలో భారీ మార్పులు!

**హైదరాబాద్ , అక్టోబర్ 13 (జై భీమ్ న్యూస్) :**

మెట్రో నగరాలలో ట్రాఫిక్ రద్దీ పెద్ద సమస్యగా మారింది. నగరాల సుందరీకరణ, ప్రయాణ సౌలభ్యం కోసం ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. అయితే.. క్షేత్రస్థాయి పరిస్థితులు, వ్యయ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కొన్ని ప్రాజెక్టులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. తాజాగా హైదరాబాద్ లో అత్యంత రద్దీ ప్రాంతమైన కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చేపట్టాల్సిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళికలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ పలు మార్పులు చేసింది. గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం, కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు రూ.1,090 కోట్ల వ్యయంతో ఏడు అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైఓవర్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే.. నగరంలో మారుతున్న ట్రాఫిక్ అవసరాలు, స్థానిక భౌగోళిక పరిస్థితులు, వ్యయ నియంత్రణను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ, స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. కొత్త ప్రణాళికల ప్రకారం, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముఫ్కంజా ఇంజనీరింగ్ కాలేజీ వరకు రూ.715.16 కోట్ల అంచనా వ్యయంతో సరికొత్త స్టీల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన బంజారాహిల్స్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వద్ద 2-లేన్ సింగిల్ వే ఫ్లైఓవర్, టీవీ9 జంక్షన్ వద్ద అండర్‌పాస్‌లు వంటి అనేక పనులను రద్దు చేశారు. మొత్తం ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా విభజించి పనులను వేగవంతం చేయాలని కమిటీ భావిస్తోంది. ప్యాకేజీ-1 పరిధిని జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్ నుంచి ముగ్ధ జంక్షన్ వరకు స్టీల్ ఫ్లైఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. గతంలో రూ.580 కోట్లుగా అంచనా వేసిన ఈ ప్రాజెక్టు వ్యయాన్ని సవరిస్తూ, రూ.365.85 కోట్లకు కుదించారు. రూ.510 కోట్లుగా ఉన్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.349.31 కోట్లకు సవరించారు. ఈ రెండు ప్యాకేజీల నిర్మాణ పనులను ప్రస్తుతం మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ సంస్థకు అప్పగించాలని స్టాండింగ్ కమిటీ నిర్ణయించింది. కేవలం రవాణా రంగానికే కాకుండా, నగరంలోని ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి కూడా స్టాండింగ్ కమిటీ పెద్దపీట వేసింది. ఆరాంఘర్ ? జూపార్కు మార్గంలో 6-లేన్ గ్రేడ్ సెపరేటర్ నిర్మాణానికి రూ.799.74 కోట్ల సవరించిన అంచనాలను ఆమోదించారు. అలాగే ఒవైసీ హాస్పిటల్, బహాదుర్‌పురా జంక్షన్ల వద్ద మల్టీలెవెల్ ఫ్లైఓవర్ల కోసం రూ.161 కోట్లు కేటాయించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem tv

# అప్పటివరకు నేను చాలా అందగత్తెనని అనుకున్నాను.. కానీ!: అనుష్క శర్మ

**ఆదిత్య చోప్రా వ్యాఖ్యలను గుర్తుచేసుకున్న అనుష్క శర్మ**
**నువ్వు అందంగా లేవు, ప్రతిభతోనే రాణించాలని చెప్పిన డైరెక్టర్**
**ఆఫీసులో మామూలుగానే ఉన్నా, కారులో ఏడ్చేసిన వైనం**
**షూటింగ్‌లో తనను తాను చూసుకుని, ఆయన చెప్పింది నిజమేననిపించిందని వెల్లడి**
**'రబ్ నే బనా ది జోడీ'కి ముందు ఎన్నో తిరస్కరణలు ఎదుర్కొన్నానని ప్రస్తావన**



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శర్మ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన ఒక కఠినమైన అనుభవాన్ని పంచుకున్నారు. తన తొలి చిత్రం 'రబ్ నే బనా ది జోడీ' సమయంలో నిర్మాత, దర్శకుడు ఆదిత్య చోప్రా తనతో అన్న మాటలు తనను ఎంతగా ప్రభావితం చేశాయో 'కాఫీ విత్ కరణ్' షోలో వెల్లడించారు. ఈ సంఘటనను గుర్తుచేసుకుంటూ అనుష్క, "నేను ఆదిత్య చోప్రా ఆఫీసులో నాలుగో అంతస్తులో ఉన్నాను. ఆయన నాతో, 'వినండి, మీ ప్రతిభపై నాకు చాలా నమ్మకం ఉంది. మీరు మంచి నటి. కానీ మీరు చూడటానికి అంత అందంగా ఉండరు. అందుకే మీరు చాలా కష్టపడాలి. 'తానీ' పాత్రకు మిమ్మల్ని తీసుకుంటున్నాం' అని నిక్కచ్చిగా చెప్పారు" అని తెలిపారు. ఆ మాటలు విన్న తర్వాత తన స్పందన గురించి వివరిస్తూ, "ఆఫీసు నుంచి బయటకు వచ్చేటప్పుడు నేను చాలా మామూలుగానే ఉన్నాను. ఆయనకు 'థాంక్యూ' చెప్పి వచ్చేశాను. కానీ కారులో వెళ్తుండగా నాకే తెలియకుండా ఏడుపు వచ్చేసింది. కారు ఆపి మరీ ఏడ్చాను. ఆ సమయంలో మా అమ్మానాన్న ఊళ్లో లేరు. మా అమ్మకు ఫోన్ చేసి, 'ఇలా జరిగిందని నమ్మలేకపోతున్నాను' అని చెప్పాను" అని అనుష్క ఆనాటి బాధను పంచుకున్నారు. ఆదిత్య చోప్రాను కలవక ముందు, తనను తాను చాలా అందగత్తెనని అనుకునేదాన్నని ఆమె అంగీకరించారు. "షూటింగ్ సమయంలో పెళ్లికూతురు దుస్తుల్లో నన్ను నేను మొదటిసారి మానిటర్‌పై చూసుకున్నప్పుడు, ఆయన చెప్పిందే నిజమనిపించింది. 'ఆయన చెప్పింది కరెక్టే. నేను అంత అందంగా లేను' అని అప్పుడు అర్థమైంది" అని అనుష్క వివరించారు. షారుఖ్ ఖాన్ సరసన ఈ అవకాశం రాకముందు తాను ఎన్నో తిరస్కరణలు ఎదుర్కొన్నానని కూడా ఆమె ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

## ఏఐ ఫొటోలు చూస్తే 'అది నేనేనా?' అనిపిస్తుంది: నటి శ్రియ ఆవేదన

**ఏఐ మార్ఫింగ్ ఫొటోలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన నటి శ్రియ**
**అసభ్యకరమైన ఫొటోలు చూసినప్పుడు చాలా బాధగా ఉంటుందన్న శ్రియ**
**ఏఐ టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడాలని సూచన**
**పరిశ్రమలో తెర వెనుక మహిళల భాగస్వామ్యం పెరగాలని అభిప్రాయం**
**25 ఏళ్ల సినీ ప్రయాణంలో వచ్చిన మార్పులను గుర్తు చేసుకున్న నటి**



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ దుర్వినియోగంపై, ముఖ్యంగా డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలపై సీనియర్ నటి శ్రియ శరణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన ఫొటోలను అసభ్యంగా మార్ఫింగ్ చేస్తున్నారని, వాటిని చూసినప్పుడు 'అసలు అక్కడ ఉన్నది నేనేనా?' అనే సందేహం, ఆవేదన కలుగుతాయని ఆమె అన్నారు. కొన్నిసార్లు తన శరీరాకృతిని అసహ్యంగా మార్చేస్తున్నారని, ఒంటిపై ఉన్న దుస్తులను తొలగించి చిత్రీకరిస్తున్నారని శ్రియ వాపోయారు. ఇది కొందరికి నవ్వులాటగా అనిపించవచ్చని, కానీ తనకు మాత్రం ఎంతో బాధ కలిగిస్తుందని చెప్పారు. గతంలో తాను కూడా ఇలాంటి మార్ఫింగ్ ఫొటోల బారిన పడ్డానని గుర్తు చేసుకున్నారు. ఏఐ టెక్నాలజీకి ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, దానిని బాధ్యత లేకుండా వాడితే తీవ్రమైన ప్రమాదాలు తప్పవని, ఇలాంటి సాంకేతిక సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తన 25 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని కూడా శ్రియ గుర్తు చేసుకున్నారు. 2001లో 'ఇష్టం' సినిమాతో కెరీర్ ప్రారంభించినప్పటి రోజులను తలుచుకున్నారు. అప్పట్లో కారవాన్లు ఉండేవి కావని, చెట్ల కింద కూర్చుని భోజనం చేస్తూ పుస్తకాలు, సంగీతం గురించి మాట్లాడుకునేవాళ్లమని చెప్పారు. కానీ ఇప్పుడు ప్రతి ఒక్కరూ ఇయర్‌ఫోన్లతో తమ సొంత ప్రపంచంలో ఉంటున్నారని, కథలు చెప్పే విధానం కూడా పూర్తిగా మారిపోయిందని తెలిపారు. పరిశ్రమలో మహిళల పాత్రపై కూడా ఆమె తన అభిప్రాయాలను పంచుకున్నారు. నటీమణులుగా తెరపై కనిపించడం కంటే, తెర వెనుక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో మహిళలు ఉండటం ఎంతో అవసరమని ఆమె నొక్కి చెప్పారు. కథల ఎంపిక, పెట్టుబడుల వంటి కీలక అంశాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. కేవలం మహిళా ప్రాధాన్య చిత్రాలు తీసి, తెర వెనుక కీలక పనులన్నీ పురుషులే చేస్తే దాన్ని మహిళా చిత్రం అని ఎలా అంటామని ప్రశ్నించారు. పరిశ్రమలో మార్పు ఇప్పుడిప్పుడే మొదలైందని, ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు.

## జైలర్ 2 దూకుడు: విడుదలకు ముందే రూ.34 కోట్లు.. బాక్సాఫీస్ షేక్!

సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన సినిమా వస్తోందంటే చాలు, థియేటర్ల వద్ద పండుగ వాతావరణం నెలకొంటుంది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా 'జైలర్ 2' చిత్రం విడుదలకు ముందే సరికొత్త రికార్డులతో బాక్సాఫీస్ వేటకు సిద్ధమైంది. అక్టోబర్ 15న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో ఊహించని డిమాండ్ కనిపిస్తోంది. ప్రముఖ ట్రేడ్ అనలిటిక్స్ సంస్థ శాక్‌నిల్క్ విడుదల చేసిన లెక్కల ప్రకారం, 'జైలర్ 2' చిత్రం నాలుగు రోజుల షోలకు గాను బ్లాక్ చేసిన సీట్లతో కలిపి రూ.34.14 కోట్లు రాబట్టింది. కేవలం అమ్ముడైన టికెట్ల ద్వారానే రూ.29.86 కోట్లు వసూలు కావడం విశేషం. ఇక మొదటి రోజు అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారానే రూ.18.71 కోట్లు వచ్చాయంటే రజనీ మేనియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. దక్షిణాది రాష్ట్రాల్లో 'జైలర్ 2' టికెట్లకు తీవ్రమైన పోటీ నెలకొంది. అడ్వాన్స్ బుకింగ్స్‌లో తమిళనాడు రూ.8.54 కోట్లతో అగ్రస్థానంలో నిలవగా, కేరళ (రూ.3.90 కోట్లు), కర్ణాటక (రూ.3.72 కోట్లు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ క్రేజ్ బలంగా ఉంది. తెలంగాణలో రూ.1.50 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.58.53 లక్షల మేర అడ్వాన్స్ బుకింగ్స్ నమోదయ్యాయి. నగరాల వారీగా చూస్తే చెన్నై రూ.3.84 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, బెంగళూరు (రూ.3.55 కోట్లు), హైదరాబాద్ (రూ.1.28 కోట్లు) నగరాల్లోనూ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. హిందీ వెర్షన్ 'రజనీ: ది జైలర్ 2'కు సైతం పూణే, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో మంచి స్పందన కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో సినిమాకున్న భారీ డిమాండ్ దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, యోగి బాబు, ఎస్‌జే సూర్య, మిథున్ చక్రవర్తి, విద్యా బాలన్ కీలక పాత్రలు పోషించారు. మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటులు జాకీ ష్రాఫ్, హృతిక్ రోషన్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. బుక్‌మైషో వంటి ప్లాట్‌ఫామ్స్‌లో ప్రధాన నగరాల్లో బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

## నయనతార పొలిటికల్ ఎంట్రీపై ఆమె భర్త విఘ్నేశ్ శివన్ క్లారిటీ

**నయనతార రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు**
**స్పష్టతనిచ్చిన భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్**
**ప్రస్తుతం కుటుంబం, కెరీర్‌కే తమ ప్రాధాన్యత అని వెల్లడి**



తమిళనాడులో నటి నయనతార రాజకీయ ప్రవేశంపై జోరుగా సాగుతున్న ఊహాగానాలకు ఆమె భర్త, దర్శకుడు విఘ్నేశ్ శివన్ స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా కుటుంబం, పిల్లల పెంపకం, వృత్తిపరమైన పనులపైనే ఉందని ఆయన తెలిపారు. ఈ విషయంలోనే తాము సంతృప్తిగా ఉన్నామని పేర్కొంటూ, పరోక్షంగా రాజకీయ ప్రవేశ వార్తలను ఖండించారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా నటుడు విజయ్ బాధ్యతలు స్వీకరించి, పాలన సాగిస్తున్న నేపథ్యంలో.. నయనతార, త్రిష వంటి ప్రముఖ నటీమణులు కూడా రాజకీయాల్లోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా 2031 అసెంబ్లీ ఎన్నికల నాటికి నయనతార రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని కొందరు అంచనా వేస్తున్నారు. ఈ ఊహాగానాలపై విఘ్నేశ్ శివన్ స్పందిస్తూ... ప్రస్తుతం తమకు కుటుంబ బాధ్యతలు, పిల్లల ఆలనాపాలన, వృత్తి జీవితమే ముఖ్యమని స్పష్టం చేశారు. మరోవైపు, నయనతార ప్రస్తుతం 'మూక్కుత్తి అమ్మన్ 2', 'డియర్ స్టూడెంట్స్', 'రక్కాయి' వంటి పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. గతంలో ఎంజీఆర్, జయలలిత వంటి సినీ ప్రముఖులు రాజకీయాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించిన చరిత్ర తమిళనాడుకు ఉంది. అయితే, నయనతార రాజకీయ ప్రవేశంపై ఆమె నుంచి అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ ఊహాగానాలు కొనసాగే అవకాశం ఉంది.

## 'క్రేజీ కల్యాణం'లో ఆ సీన్ హైలైట్.. సింగిల్ టేక్‌లో నవరసాలు పండించా: నరేశ్

**దసరా కానుకగా అక్టోబర్ 16న 'క్రేజీ కల్యాణం' విడుదల**
**ఆరు నిమిషాల సింగిల్ టేక్ నవరస సన్నివేశం హైలైట్ అంటున్న నరేశ్**
**ఈ సినిమా కోసమే తొలిసారి 'నవరసరాయ' బిరుదును వాడుతున్నామని వెల్లడి**
**తరుణ్ భాస్కర్, అనుపమ, అఖిల్‌తో కలిసి నటించిన నరేశ్**
**ఆ సీన్ పూర్తయ్యాక భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్నట్లు వెల్లడి**



'నవరసరాయ' నరేశ్, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉద్దెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. భద్రప్ప గాజుల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని యారో సినిమాస్ పతాకంపై బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మించారు. దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 16న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నరేశ్ చిత్ర విశేషాలను పంచుకున్నారు. ఈ సినిమాలో దాదాపు ఆరు నిమిషాల పాటు సాగే ఒక సింగిల్ టేక్ సన్నివేశం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని నరేశ్ తెలిపారు. "350 మంది ఉన్న ఒక పెద్ద సెట్‌లో ఈ సన్నివేశాన్ని చిత్రీకరించారు. ఇందులో నేను తొమ్మిది మంది విభిన్న పాత్రలతో మాట్లాడుతూ నవరసాలను పండించాను. ఇలాంటి సన్నివేశానికి ఎలాంటి రిఫరెన్స్ లేకపోవడంతో మొదట కొంచెం కంగారుపడ్డాను. కానీ, దర్శకుడు భద్రప్ప నాలో ధైర్యం నింపి, 'మీరే దీనికి రిఫరెన్స్ అవుతారు' అని ప్రోత్సహించారు. కొన్ని రిహార్సల్స్ తర్వాత ఒకే టేక్‌లో ఆ సన్నివేశాన్ని పూర్తి చేశాను" అని వివరించారు. ఆ సీన్ పూర్తయ్యాక కలిగిన భావోద్వేగంతో కొన్ని నిమిషాల పాటు కన్నీళ్లు ఆపుకోలేకపోయానని ఆయన వెల్లడించారు. 'క్రేజీ కల్యాణం' ఒక మధ్యతరగతి గ్రామీణ కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండే మానసిక సంఘర్షణల నేపథ్యంలో సాగే వినోదాత్మక చిత్రమని నరేష్ పేర్కొన్నారు. సినిమాలో తాను, తరుణ్ భాస్కర్, అనుపమ, అఖిల్ పోషించిన నాలుగు పాత్రలు కథకు నాలుగు స్తంభాల్లా నిలుస్తాయని అన్నారు. తన 'నవరసరాయ' బిరుదును తొలిసారి ఈ సినిమా టైటిల్స్‌లో వాడుతున్నామని, ఈ చిత్రం ఆ బిరుదుకు సరైన అర్థం చెబుతుందని ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడికి తెలంగాణ యాసపై ఉన్న పట్టు, నిర్మాత రాజీపడని తత్వం సినిమా విజయంలో కీలక పాత్ర పోషిస్తాయని నరేశ్ అన్నారు.